క్లుప్తంగా

లలితామూర్తికి ఘన నివాళి



లలితామూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత

మడకశిరరూరల్: మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి సోదరుడు చలవ మూర్తి సతీమణి లలితామూర్తి (73) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నీలకంఠాపురంలో లలితామూర్తి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం రఘువీరతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విధులకు డుమ్మా



తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులే విధులకు హాజరైన దృశ్యం

పెనుకొండ రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వివిధ సమస్యలతో తరలివచ్చిన ప్రజలతో నిత్యం కిటకిటలాడుతుంటుంది. అయితే అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా మంగళవారం కార్యాలయానికి వివిధ సమస్యలపై వచ్చిన వారికి నిరాశే ఎదురైంది. తహసీల్దార్‌తో పాటు, సివిల్ సప్లయ్స్ తహసీల్దార్, రీ సర్వే తహసీల్దార్, ఆర్‌ఐ ఎవరూ కార్యాలయంలోని వారి సీట్లలో కనిపించలేదు. కేవలం సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇద్దరు అటెండర్లు మాత్రమే విధులకు హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. అయితే అధికారుల కోసం అర్జీలు పట్టుకొని వచ్చిన వారంతా చెట్ల కిందనే పడిగాపులు కాశారు.

వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



మాట్లాడుతున్న డీన్ సరోజినిదేవి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం భారతదేశం మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ సరోజినిదేవి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ విద్య వైపు మొగ్గు చూపి రైతులకు సాంకేతికతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌రావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, సిబ్బంది

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఈమేరకు మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ స్పోర్ట్స్ మీట్స్‌లో 53 మంది పాల్గొనగా 12 మంది జాతీయ సెస్టోబాల్ పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పీఈటీ షభానా, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

ఘనంగా ఆశ డే

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శివానంద ఆధ్వర్యంలో మంగళవారం ఆశ డే నిర్వహించారు. శివానంద మాట్లాడుతూ ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

గోదాములో విద్యుత్ షార్ట్ సర్క్యూట్



గోదాములో మంటలు వ్యాపించిన దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు ప్రభుత్వాస్పత్రి సమీపంలోని ఓ గోదాములో మంగళవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఆస్తినష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

- రైతులకు సకాలంలో అందని సేవలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

హిందూపురం: వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చేవిధంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు ముంగిటకే అన్ని రకాలు సేవలు అందజేసింది. ఈ నేపథ్యంలోనే కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తే అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు రాయితీతో అందించేవారు. అయితే ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారడంతో వ్యవసాయ సీజన్‌లో రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందటం లేదు.

77 కియోస్క్ యంత్రాలు

హిందూపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో రైతు సేవా కేంద్రాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 77 కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. 'రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి' అనే నినాదంలో రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. దీని ద్వారా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందించే ప్రయోజనాలు ఆన్‌లైన్ చేసేవారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం రైతులు ముందస్తుగా నమోదు చేసి వాటికి నగదు చెల్లించేవారు. మధ్యవర్తి ప్రమేయం లేకుండా నేరుగా రైతులు అవసరమైన విత్తనాలు, ఎరువులు చేతికందేవి. ఫలితంగా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు చేతికి అందేవి. రైతు సేవా మిత్రల హాజరు, వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పుల వాటి ముందస్తు సమాచారం సైతం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందేవి. వాటి ఆధారంగా వ్యవసాయ సిబ్బంది రైతులను అప్రమత్తం చేసేవారు. రైతులు ఏ పంట వేయాలన్నా సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపర్చి ఉండేవారు. అయితే ప్రస్తుతం ఆ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

పేరు మారింది.. సేవలు నిలిచాయి

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే)గా పేరు మార్చింది. సేవా కేంద్రాలుగా పేరుకే మారాయి కానీ రైతుకు సేవలు అందజేయడంలో విఫలం అయ్యారని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్కొ యంత్రాలు పని చేయడం లేదు. కొన్నిచోట్ల పూర్తిగా వాటిని విస్మరించడంతో మూలకు పెట్టేశారు. వచ్చే సీజన్‌లోనైనా వాటిని వాడకంలోకి తీసుకొచ్చి ప్రజాధనం నిరుపయోగంగా మారకుండా వ్యవసాయానికి చేయూత అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హిందూపురం: రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

సేవలు పునరుద్ధరించాలి



రైతులకు పూర్తిస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ సేవలు పునరుద్ధరించాలి. వ్యవసాయ యాప్‌ల గురించి అవగాహన కల్పించి, మారుతున్న కాలానుగుణంగా దిగుబడులు పెంచడానికి కృషి చేయాలి. ఆర్ఎస్‌కేలోని కియోస్క్ మెషిన్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి.

– గౌస్‌పీరా, సంతేబిదనూర్

నివేదికలు పంపించాము



కియోస్క్ కంపెనీ నిపుణులకు నివేదికలు పంపించాము. పూర్తి సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాము. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాము. ప్రస్తుతం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు, విత్తనాలు వ్యవసాయ సిబ్బంది అందజేస్తున్నారు. రైతుల సౌలభ్యం కోసం సెల్‌ఫోన్ యాప్ ద్వారా సేవలు అందిస్తున్నాము.

– అల్తాఫ్ అలీఖాన్, ఏడీఏ, హిందూపురం

వైఎస్సార్‌సీపీపై నిందలు సరికావు

పెనుకొండ రూరల్: రెండు రోజుల క్రితం పట్టణంలో జరిగిన ఘర్షణతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని కౌన్సిలర్ సద్దాం స్పష్టం చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఖబరస్థాన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల నుంచి ఖబరస్థాన్ రోడ్డు పక్కన దుకాణాలను జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల క్రితం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు వైఎస్సార్‌సీపీకి, తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అనవసరమైన వాటికి పార్టీ రంగులు పులమడం తగదన్నారు. గతంలో ఎందరో ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేసినా మైనార్టీల విషయాల్లో జోక్యం చేసుకోలేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదున్నారు. ఏకంగా మంత్రి సవిత భర్త రోడ్ల మీదకు వచ్చి మైనార్టీల శవాలు లేస్తాయి. బాడీల కనపడకుండా చేస్తామనడం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి ఘనటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన మంత్రి సవితను కోరారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ తయ్యూబ్, మౌలానా అసన్ రజా, షెక్షా, ఖాజా, ఇర్షాద్, బాబావలి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ సద్దాం

బాబు ష్యూరిటీ .. బాదుడు గ్యారంటీ

గుడిబండ: 'ఎన్నికల ముందు విద్యుత్ చార్జీ పెంచమని హామీ ఇచ్చి తీరా అధికారంలోని వచ్చిన తర్వాత ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలోకి తొక్కుతోంది' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఫళారం గ్రామంలో మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించి ప్రజలను మరోసారి మోసగించారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన బాబు ష్యూరిటీ ఏమోగాని బాదుడు గ్యారంటీ అన్నట్లుగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయన్నారు. విద్యుత్ కంపెనీల సర్దుబాటు చార్జీలకు అనుమతి ఇవ్వడం ద్వారా వినియోగదారులపై రూ.15 వేల కోట్ల భారం పడుతుందన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పిన చంద్రబాబు.. ప్రజల సంపదను ఆవిరి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఈరలక్కప్ప

గోరంట్లలో భారీ వర్షం



గోరంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం



సోమందేపల్లిలో కురుస్తున్న వర్షం

గోరంట్ల: తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం పడింది. గోరంట్లలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ వర్షం దంచి కొట్టింది.దీంతో పురవీధులన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షానికి వ్యాపారులు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

సోమందేపల్లిలోనూ...

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఏకధాటిగా కురిసిన వర్షానికి జీన జీవనం స్తంభించింది.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

రొళ్ల: సాగునీటి సంఘం ఎన్నికలు సజావుగా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మడకశిర మైనర్ ఇరిగేషన్‌శాఖ డీఈ తిరుమలేశ్వరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి అధ్యక్షతన మండల, గ్రామస్థాయి అధికారులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు.

అయ్యప్పస్వామి ఆలయం ప్రారంభం

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గ్రామ కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో నూతన అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించారు. నూతన ఆలయాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భక్తులు ప్రారంభించి పూజలు చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, ద్విచక్ర వాహనాలు

హిందూపురం అర్బన్: హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కర్ణాటక నుంచి మద్యం పాకెట్లు తరలిస్తున్న పరిగి మండలం పరిధిలో వేలు, మారెప్ప, మారుతి అనే వ్యక్తుల నుంచి 222 హైవార్డ్స్ విస్కీ కర్ణాటక మద్యం ప్యాకెట్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

హిందూపురం: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కెరీర్ గైడెన్స్ చాలా అవసరమని విప్రోకేర్ హెచ్ఆర్ రామకృష్ణ సూచించారు. వాసవ్య మహిళా మండలి విప్రో కేర్స్ సహకారంతో కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ అమలు చేస్తున్న కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమంలో సంతేబిదనూరు ఉన్నత పాఠశాలకు చెందిన 64 మంది విద్యార్థినులతో విప్రో ఫ్యాక్టరీని సందర్శించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

పరిగి: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానాన్ని పొందడానికి తప్పని సరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే రవాణాకు అనుమతి ఉంటుందని తహసీల్దారు హసీనా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమంగా ఎవరైనా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెచ్ఎం సస్పెన్షన్ సరికాదు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం సరికాదని ఏపీటీఎఫ్ మండల సంఘం నాయకులు లతారామకృష్ణ, రామకృష్ణ, జయరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి చేతన్‌ను స్కూల్ బ్రేక్ టైమ్‌లో మేనమామ వచ్చి తీసుకెళ్లి హత్య చేయడం బాధాకరమన్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులు వివిధ పనులతో ఒత్తిడిలో ఉన్నారని ఇలాంటి ఘటనలతో మరింత ఒత్తికి గురిచేయడం ప్రభుత్వానికి తగదన్నారు.

తిరుమణి పంచాయతీ అధ్యక్షురాలిగా లక్ష్మిదేవి

పావగడ: తాలూకాలోని తిరుమణి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మిదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అధ్యక్ష స్థానానికి మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అధ్యక్షురాలిగా ఏక గ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు అధికారికంగా ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ డీఈఈగా రాజేంద్రబాబు

మడకశిరరూరల్: మడకశిర విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ డీఈఈగా రాజేంద్రబాబు మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విద్యుత్ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాజేంద్రబాబు తెలిపారు.

వరి రైతులకు నష్టం



పెనుకొండ సమీపంలో నేల వాలిన వరి పంట

పెనుకొండ: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల పరిధిలోని వరి రైతుల పొలాల్లో వరి పంట నేలవాలిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పంట కోసిన రైతులు కల్లాల్లో పంటను ఆరబెట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

బీమా ప్రీమియం చెల్లించండి

రొళ్ల: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీలోపు తప్పని సరిగా బీమా ప్రీమియం చెల్లించాలని మడకశిర వ్యవసాయశాఖ ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.630, వేరుశనగకు రూ.480, టమాటకు రూ.1600 చెల్లించాలన్నారు.

రథం పునరుద్ధరణకు విరాళం

హిందూపురం: హిందూపురంలోని పేట వేంకటరమణస్వామి దేవస్థానంలోని రథం పునరుద్ధరణకు లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ రూ.1,50,116 విరాళానికి అందజేశారు. ఆలయ అభ్యున్నతికి తనవంతు సహకారం ఉంటుందన్నారు.

శుభకార్యం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామంలో మాజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బీదురమ్మ చంద్రప్ప కుమారుడు రాకేష్, బిందుల వివాహం మంగళవారం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామితో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో వారు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



సచివాలయంలో మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని 13, 14వ వార్డుల్లోని సచివాలయాలను మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



న్యాయవాదులతో సమావేశమైన జడ్జి అశోక్

మడకశిర: మడకశిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ తెలిపారు. అదాలత్ విజయవంతం చేయడానికి న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ఆయన మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

యాక్షన్ ప్లాన్ సవరించాలి

రొళ్ల: విద్యాశాఖ అధికారులు పదో తరగతి విద్యార్థులకు ప్రకటించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ అసంబద్ధంగా ఉందని, దానిని తప్పనిసరిగా సవరించి స్థానిక హెచ్ఎం సబ్జెక్ట్ నిపుణులతో తయారు చేసి అమలు చేయాలని డెమొక్రటిక్ టీచర్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కట్టుబడి గౌస్‌లాజమ్, మారుతీప్రసాద్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

లాభదాయక పంటలపై దృష్టి సారించాలి

పరిగి: రైతులు లాభదాయకమైన పంటల సాగుపై దృష్టి సారించాలని హిందూపురం వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ ఆలీఖాన్ తెలిపారు. మంగళవారం మండలంలో జరిగిన పొలంబడి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ విజయభారతి పాల్గొన్నారు.

మేజర్ ధ్యాన్‌చంద్ వర్ధంతి

లేపాక్షి: మండలంలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ వర్ధంతి నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషగిరిబాబు, పీడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరుడికి పూజలు



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

గుడిబండ: మండల పరిధిలోని పి గొల్లహట్టిలో వెలసిని సిద్ధేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో, మంగళ వాద్యాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు



హిందూపురం: విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మీ



మడకశిర: విద్యార్థుల మానవహారం

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలు వక్తలు స్ఫూర్తిదాయమైన విషయాలను వివరించారు. హిందూపురంలోని భవిత కేంద్రంలో ఎంఈఓ గంగప్ప అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ లక్ష్యం సాధించడానికి అంగవైకల్యం అడ్డుకాదన్నారు. ప్రతిభ ఉంటే సులువుగా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు.



లేపాక్షి : భవిత కేంద్రంలో నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు



గోరంట్ల: దివ్యాంగుడికి వీల్‌చైర్ అందిస్తున్న ఎంఈఓ జాన్‌రెడ్డప్ప

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

సోమందేపల్లి: పాఠశాల విద్యార్థులు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.